ఎస్సీ వర్గీకరణకు ఆమోదం

మొదటిపేజీ తరువాయి...

అమల్లోకి వచ్చింది. కానీ, 2004 నవంబర్‌లో సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఎస్సీ కులాల జాబితాలో జోక్యం, పునర్‌వర్గీకరణ అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని తేల్చిచెప్పింది. నాటి నుంచి ఈ అంశం పెండింగ్‌లోనే ఉన్నది. గత ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఎస్సీ రిజర్వేషన్‌ను వర్గీకరణ చేసుకునే అధికారం రాష్ట్రాలకు ఉన్నదని తీర్పిచ్చింది. దీంతో వర్గీకరణను అమలుకు సిఫారసులు చేసేందుకు మంత్రి ఉత్తమ్ చైర్మన్‌గా క్యాబినెట్ సబ్‌కమిటీని, హైకోర్టు మాజీ న్యాయమూర్తి షమీమ్ అక్తర్ నేతృత్వంలో ఏకసభ్య జ్యుడిషియల్ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. 2011 జనాభా లెక్కలను ఆధారంగా రిజర్వేషన్లను కమిషన్ వర్గీకరించింది. రాష్ట్రంలో 52,17,684 మంది ఎస్సీ జనాభా ఉన్నట్టు నిర్ధారించింది. 59 షెడ్యూల్ కులాలను మూడు గ్రూప్‌లుగా విభజించింది. ఎస్సీలకు అమలుచేస్తున్న 15% రిజర్వేషన్లను ఏ గ్రూప్‌లోని 15 ఎస్సీకులాలకు 1%, బీ గ్రూప్‌లోని 18 ఎస్సీ కులాలకు 9%, సీ గ్రూప్‌లోని 26 కులాలకు 5% చొప్పున రిజర్వేషన్ అమలుచేయాలని సిఫారసు చేసింది. ఈ నివేదికను ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించింది. తాజాగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలుకు ప్రత్యేకంగా చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించిన ప్రభుత్వం.. బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆ బిల్లుకు బీఆర్ఎస్‌తోపాటు అన్ని పక్షాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి.

ఎస్సీ-ఏ గ్రూప్‌లోని కులాలు

బావురి, బేడా (బడ్గ) జంగం, చదాటి, డక్కల్, డొక్కల్వార్, జగ్గలి, కొలుపుల వాండ్లు, పంబాడ, పంబండ, పంబాల, మాంగ్, మాంగ్ గరోడి, మన్నే, మస్లీ, మాతంగి, మెహతర్, ముండాల, సంబన్, సప్పు

ఎస్సీ-బీ గ్రూప్‌లోని కులాలు

ఆరుంధతీయ, బైండ్ల, చమర్, మోచీ, ముచి, చమర్ రవిదాస్, చమర్ రోహిదాస్, చంబర్, చండాల, దండాసి, డోమ్, డోంబరా, పైడి, పానో, ఎల్లమ్మల్వార్, ఎల్లమ్మలవాండ్లు, గోదారి, జాంబువులు, మాదిగ, మాదిగ దాసు, మస్తీన్, పామిడి, పంచమ, పరియ, సమగర, సిందోళ్లు (చిందోల్లు), యాటల, వల్లువన్.

ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ ఇలా..

గ్రూప్	కులాలు	రిజర్వేషన్ శాతం
గ్రూప్-ఏ	15	1%
గ్రూప్-బీ	18	9%
గ్రూప్-సీ	26	5%
మొత్తం	59	15%

ఎస్సీ-సీ గ్రూప్‌లోని కులాలు

ఆది ఆంధ్ర, ఆది ద్రావిడ, ఆనాముక్, ఆరె మాల, ఆర్వ మాల, బారికి, బ్యాగరి, చలవాడి, డోర్, ఘాసి, హడ్డి, రెల్లి, దాచండి, గోసంగి, హోలేయా, హోలేయ దాసరి, మాదాసి కురువ, మాదరి కురువ, మహర్, మాల, మాల అయ్యవార్, మాల దాసరి, మాలదాసు, మాల హన్నయ్, మాల జంగం, మాల మస్తీ, మాల సాలె, నేతకాని, మాల సన్యాసి, మిత అయ్యల్వార్, పాకి, మోటీ, తోటి, రెల్లి.

మాదిగల పోరాటానికి బీఆర్ఎస్ బాసట

ఎస్సీ వర్గీకరణ చట్టం అమలుకు మాదిగలతో పాటు ఇతర దళితవర్గాలు దశాబ్దాలుగా అలుపెరగకుండా పోరాడుతున్నాయి. ఎన్నికల సమయంలో సమస్యను పరిష్కరిస్తామని, చొరవ చూపుతామని జాతీయపార్టీలు హామీ ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక అటకెక్కించడం పరిపాటిగా మారిపోయింది. 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం రాజ్యాంగ సవరణ కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేయగా, దానికి ప్రతిస్పందనగా కేంద్రంలోని సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఉషామెహ్రా కమిషన్‌ను ఏర్పాటుచేసింది. 2008 మేలో అప్పటి కేంద్ర మంత్రి మీరాకుమార్‌కు కమిషన్ నివేదికను సమర్పించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్-341ని సవరించాలని, ఆ ఆర్టికల్‌లో 3వ క్లాజును చేర్చడం ద్వారా, రాష్ట్ర అసెంబ్లీలు ఏకగ్రీవ తీర్మానం చేసిన పక్షంలో కులాల వర్గీకరణను పార్లమెంట్ ఆమోదించవచ్చని కమిషన్ సిఫారసు చేసింది. కానీ, కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం దానిని పట్టించుకోలేదు. 2014 ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే 100 రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. ఇప్పటివరకూ పట్టించుకోలేదు. ఎస్సీ వర్గీకరణకు ఉద్యమకాలం నుంచే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బాసటగా ఉన్నారు. పోరాటానికి వెన్నుదన్నుగా నిలిచారు. రిజర్వేషన్ల వర్గీకరణ ప్రాధాన్యంపై గళం వినిపించారు. దళితవర్గాల ప్రతి పోరాటానికి మద్దతు పలికారు. ధర్నాల్లోనూ పాలుపంచుకున్నారు. 2014లో పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపరిచి ఎస్సీ వర్గీకరణ అంశంపై మద్దతు తెలిపారు. అధికారంలోకి వచ్చిన అనంతరం ఎస్సీ వర్గీకరణ కోసం 2014 నవంబర్ 29న అసెంబ్లీలో తీర్మానం చేశారు. శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. కేసీఆర్ 2016 మే 11న ప్రధాని మోదీని కలిసి ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. తరువాత కూడా ఎస్సీ వర్గీకరణకు ప్రతి దశలోనూ మద్దతు తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను 2017లో తీసుకొచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లుకు సైతం బీఆర్ఎస్ మద్దతు తెలిపి బాసటగా నిలిచింది. దళితవర్గాల చిరకాల ఆకాంక్ష నెరవేర్చింది.

రెండు వర్గీకరణలు సేమ్: దామోదర

ఎస్సీ ఉపకులాల వర్గీకరణలో పాత వర్గీకరణకు, కొత్త వర్గీకరణకు పెద్దగా తేడాలు లేవని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అసెంబ్లీలో ప్రకటించారు. 33 కులాలు కొత్త, పాత వర్గీకరణలో యథాతథంగా కొనసాగుతాయని వెల్లడించారు. ఎస్సీ కులాల వర్గీకరణ బిల్లును మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తర్వాత ఆయన ప్రసంగించారు. మొత్తం 59 ఎస్సీ కులాలను మూడు గ్రూప్‌లుగా విభజించామని తెలిపారు. గ్రూప్-1లో 15 కులాలు ఉండగా వీరి జనాభా 1,71,625 మాత్రమే ఉన్నదని, వీరికి 1% రిజర్వేషన్, గ్రూప్-2లో 18 కులాలుండగా, వీరి జనాభా 32,74,377 ఉన్నదని, వీరికి 9% రిజర్వేషన్, గ్రూప్-3లో 26 కులాలుండగా 5% రిజర్వేషన్‌ను కేటాయించామని వివరించారు. పాతవర్గీకరణలోని గ్రూప్-ఏలో ఉన్న నా లుగు, గ్రూప్-బీలోని 10, గ్రూప్-సీలోని 20 కు లాలు ఇప్పుడు 1,2,3 గ్రూపుల్లోనే కొనసాగుతాయ ని చెప్పారు. కొత్తగా చేరిన యాటాల, వల్లువాన్ కులాలతోపాటు మిగతా 26 కులాలుఇతర గ్రూపుల్లోకి మారాయని తెలిపారు. ఈ 26 కులాల జనాభా 1,78,914 (3.43%) మాత్రమేనని వివరించారు.

2 లేదా 4 గ్రూప్‌లుగా అసాధ్యం

ఎస్సీ కులాలను రెండు, లేదా నాలుగు గ్రూప్‌లుగా వర్గీకరించడం ఆచరణ సాధ్యంకాదని షమీమ్ అక్తర్ కమిషన్ అధ్యయనంలో తేలినట్టు దామోదర రాజనర్సింహ తెలిపారు. రెండు గ్రూప్‌లుగా విభజిస్తే అది అసమానతలకు దారితీస్తుందని, నాలుగు గ్రూప్‌లుగా వర్గీకరించే స్థాయిలో తేడాలు లేనందున మూడు గ్రూప్‌లుగా విభజించి రిజర్వేషన్లు అమలుచేయాలని కమిషన్ సూచించినట్టు పేర్కొన్నారు. ఎంపిరికల్ డాటా, కమిషన్ అధ్యయనం ప్రకారం నాలుగు గ్రూప్‌లుగా చేయలేమని తేల్చిచెప్పారు. మొత్తంగా 'మా వాటా.. మాకు కావాలి' అన్న ఆకాంక్ష ఈ బిల్లుతో నెరవేరబోతున్నదని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ ఏ కులానికి వ్యతిరేకం కాదని, సోషల్ జస్టిస్‌లో భాగమని స్పష్టంచేశారు. ఎస్సీ వర్గీకరణను సభ ఆమోదించాలని కోరారు.

జనాభా దామాషా ప్రకారం పెంచుతాం: ఉత్తమ్

రాబోయే రోజుల్లో ఎస్సీల జనాభా ఎంత పెరిగితే అంత మేరకు రిజర్వేషన్లను పెంచుతామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. '2011 జనాభా లెక్కల ప్రకారం వర్గీకరణ చేయడంపై కొందరు అభ్యంతర వ్యక్తంచేస్తున్నారు. ఈ మధ్యకాలంలో ఎస్సీల జనాభా 17.5% పెరిగింది. ఆ మేరకు రిజర్వేషన్లు పెంచాలన్న డిమాండ్లు ఉన్నాయి. 2026 జనగణన ప్రకారం పెరిగిన జనాభాను బట్టి రిజర్వేషన్లను పెంచేందుకు వీలు కల్పిస్తూ క్యాబినెట్ ఆమోదం తెలిపింది' అని సభలో ప్రకటించారు. క్రీమీలేయర్ అమలు చేయాలన్న షమీమ్ అక్తర్ కమిషన్ సిఫారసులను క్యాబినెట్ తిరస్కరించిందని తెలిపారు.

కేంద్ర కులగణన ఆధారంగా రిజర్వేషన్లు పెంచుతాం

ఎస్సీ వర్గీకరణకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు:సీఎం రేవంత్

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): ఎస్సీల వర్గీకరణ, రిజర్వేషన్ల అంశంలో దళితులు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, ప్రస్తుతం ఇస్తున్న రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే కులగణన తర్వాత అవసరమైతే పెంచుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుపై జరిగిన చర్చ అనంతరం సీఎం మాట్లాడారు. ఎన్నో ఏండ్లుగా వర్గీకరణ కోసం పోరాడుతున్న దళితుల కల నేటితో సాకారమైందని చెప్పారు. ఇందుకు ఏకగ్రీవంగా సహకరించిన ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్‌తోపాటు ఇతర పార్టీలు, కులసంఘాల నాయకులకు సీఎం రేవంత్‌రెడ్డి సభ సాక్షిగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలు అర్పించిన అమరుల కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఎస్సీ ఉపకులాలకు న్యాయం చేసే విషయంలో ప్రతిపక్షంతో సహా అన్ని పక్షాలను కలుపుకొని ముందుకెళ్తామని చెప్పారు. సీఎం ప్రసంగం అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. 'ఎస్సీ ఉపకులాలకు సంబంధించిన వర్గీకరణ బిల్లును నా చేతుల మీదుగా ప్రవేశపెట్టి, ఏకగ్రీవంగా పాస్ చేయించుకోవడం, మా ఉపకులాలకు నా ఆధ్వర్యంలో సామాజిక న్యాయం జరగడం నా అదృష్టం' అని చెప్పి భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు దామోదర రాజనర్సింహను అభినందించారు.

ఎస్సీ వర్గీకరణ, దేవాదాయచట్ట సవరణ బిల్లుల ఆమోదం

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణ బిల్లుతోపాటు దేవాదాయ చట్ట సవరణ బిల్లులను మంగళవారం శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదించారు. ముందుగా మంత్రి దామోదర రాజనర్సింహ షెడ్యూల్డ్ కులాల ఏకీకృత మరియు ఏకరీతి అభివృద్ధికిగానూ ఉప-వర్గీకరణ ద్వారా రిజర్వేషన్ల హేతుబద్ధీకరణకు ఉద్దేశించిన బిల్లును ప్రవేశపెట్టగా కాంగ్రెస్ సభ్యులు వివేక్ వెంకటస్వామి, వేముల వీరేశం, నాగరాజు, మందుల సామేల్, బీఆర్ఎస్ సభ్యులు ప్రశాంత్‌రెడ్డి, మాణిక్‌రావు, కాలె యాదయ్య, బీజేపీ సభ్యుడు పాయల్ శంకర్, మజ్లిస్ సభ్యుడు మాజిద్ హుస్సేన్, సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు, కడియం శ్రీహరి బిల్లును సమర్థించారు. అనంతరం దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పాలకమండలి ఏర్పాటుపై తెలంగాణ ధార్మిక మరియు హిందూ మత సంస్థల, ధర్మాదాయల చట్టం-1987 సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. బీఆర్ఎస్ సభ్యులు వేముల ప్రశాంత్‌రెడ్డి, హరీశ్‌రావు, కాంగ్రెస్ సభ్యులు బీర్ల ఐల య్య, ఆది శ్రీనివాస్, శ్రీహరి, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి, ఎంఐఎం సభ్యుడు కౌసర్ మొయినుద్దీన్, బీజేపీ సభ్యుడు పాల్వాయి హరీశ్, సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు బిల్లును సమర్థించగా, రెండుబిల్లులు ఏకగ్రీవంగా ఆమోదం పొందాయి.

వైటీడీ అంటే ఏంటి? : పాల్వాయి హరీశ్

దేవాదాయ చట్ట సవరణ బిల్లులో యాదగిరిగుట్ట దేవస్థానాన్ని వైటీడీగా పేర్కొనడంపై, అదేంటో చెప్పాలని బీజేపీ సభ్యుడు పాల్వాయి హరీశ్ వివరణ కోరారు. మంత్రి సమాధానం చెప్పలేకపోయారు. మంత్రి అధికారుల నుంచి సమాధానం కోరేందుకు ప్రయత్నించగా వారి నుంచి జవాబు రాలేదు. అనంతరం కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి జోక్యం చేసుకొని వైటీడీ కాకుండా వైజీడీ అంటే బాగుంటుందని సూచించారు.

మంత్రివర్గంలో లంబాడీలు ఉండొద్దా?

- కేసీఆర్ పాలనలోనే సామాజిక న్యాయం
- కాంగ్రెస్ ఎమ్మెల్యే బాలునాయక్
- తానూ రేసులో ఉన్నానని వెల్లడి

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): 'కేసీఆర్ హయాంలోనే సామాజిక న్యాయం జరిగింది..' ఈ మాటలు అన్నది బీఆర్ఎస్ నేత కాదు, సాక్షాత్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యే బాలు నాయక్. రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో లంబాడీ సామాజికవర్గానికి చెందిన ఒక్కరూ ఉండకూడదా? అని ఆయన ప్రశ్నించారు. మైదాన ప్రాంత గిరిజనులకు కేసీఆర్ తన మంత్రివర్గంలో స్థానం కల్పించారని కొనియాడారు. మంగళవారం అసెంబ్లీ లాబీలో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. త్వరలో మంత్రివర్గ విస్తరణ జరుగుతుందన్న చర్చ నేపథ్యంలో ఆయన పెదవి విప్పారు. 'ఇప్పటి వరకు మా సామాజికవర్గం లేకుండా ఏ క్యాబినెట్ లేదు. కాంగ్రెస్ సర్కారు ఏర్పడి 15 నెలలైనా మంత్రివర్గంలో మా లంబాడీ వాళ్లు లేరు' అని తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే 'ఏమన్నా అనండీ.. కేసీఆర్ హయాంలో సామాజిక న్యాయం జరిగింది. మా సామాజికవర్గానికి కేసీఆర్ ఎక్కడా అన్యాయం చేయలేదు. అయినా కాంగ్రెస్‌కు లంబాడీలు ఓట్లు వేశారు' అని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో ఇప్పటి వరకు లంబాడీలకు మంత్రి పదవి దక్కలేదని చెప్పారు. తమ వర్గాన్ని మంత్రివర్గంలో తీసుకునే విషయంలో అధిష్ఠానం, సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని పేర్కొన్నారు. తమ సామాజికవర్గానికి మంత్రి పదవి ఇవ్వాలని, తాను కూడా రేస్‌లో ఉన్నానని తెలిపారు. అయితే డిప్యూటీ స్పీకర్ పదవితోపాటు మంత్రి పదవి కూడా తమ సామాజికవర్గానికి వచ్చే అవకాశాలున్నాయని పేర్కొన్నారు.

'నేనే మంత్రి' అనే ఆలోచన వారిది..

తమ జిల్లాలో (ఉమ్మడి నల్గొండ) ఒక నాయకుడు తనను ఎవరు కలిసినా 'నేను మంత్రిని' అనుకుంటారని, తనకు ఆయన (ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి.. పరోక్షంగా ఈ పేరు ప్రస్తావిస్తూ) లాగా మంత్రి పదవి కావాలనే సొంత డిమాండ్ లేదని బాలు నాయక్ పేర్కొన్నారు. తనకు మంత్రి పదవి ఇవ్వాలనేది తమ సామాజికవర్గం నుంచి వస్తున్న డిమాండ్ అని చెప్పడం గమనార్హం.

ఆదినుంచీ అండగా బీఆర్ఎస్

- ఉద్యమంలో ఉన్నా.. ప్రభుత్వంలో ఉన్నా ఎస్సీ వర్గీకరణకు సంపూర్ణ మద్దతు
- 25 ఏండ్లుగా ఒకటే స్టాండ్ తీసుకున్నాం
- అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపించాం
- కేసీఆర్ వెళ్లి.. మోదీకి అందజేశారు
- పదేండ్లు కాంగ్రెస్, బీజేపీ పట్టించుకోలే
- వర్గీకరణ పూర్తయ్యాకే స్థానిక ఎన్నికలు
- వచ్చే ఉద్యోగ నియామకాల్లో వర్గీకరణ అమలుచేయాలి: ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 18(నమస్తే తెలంగాణ): ఉద్యమంలో ఉన్నా, ప్రభుత్వంలో ఉన్నా ఎస్సీ వర్గీకరణకు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇచ్చిందని, ఆదినుంచీ అండగా నిలిచిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి స్పష్టంచేశారు. ఎస్సీ వర్గీకరణపై 25 ఏండ్లుగా ఒకే స్టాండ్‌ను కొనసాగించిందని చెప్పారు. మాదిగల సామాజిక, ఆర్థిక స్థితిగతులు క్షుణ్ణంగా తెలిసిన కేసీఆర్, న్యాయమైన ఎస్సీ వర్గీకరణకు మొదటినుంచీ మద్దతుగా నిలిచారని తెలిపారు. మంగళవారం అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లుపై జరిగిన చర్చలో వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాదిగలను ఓటుబ్యాంకుగా చూడకుండా వర్గీకరణ కోసం పోరాడుతున్న మందకృష్ణ మాదిగ, సంస్థలు, వ్యక్తులు, వ్యవస్థలను, ఉద్యమాన్ని అర్థం చేసుకొని, వారి కార్యాచరణకు ఎప్పటికప్పుడు అండగా ఉన్నారని వివరించారు.

కేసీఆర్ స్వయంగా వెళ్లి మోదీని కోరారు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీలకు ఇచ్చినమాట ప్రకారం వర్గీకరణపై ముందడుగు వేసిందని వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. 2014 నవంబర్ 29న రాష్ట్ర అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని గుర్తుచేశారు. నాటి సీఎం కేసీఆర్ స్వయంగా ప్రధాని మోదీ వద్దకు వెళ్లి తీర్మానం కాపీని అందించి రాజ్యాంగ సవరణ చేయాలని కోరారని తెలిపారు. కేంద్రం నాన్చివేత ధోరణి అవలంబిస్తే తమ ఎంపీలు పోరాటం చేశారని చెప్పారు. వర్గీకరణ పోరాటంలో కొంతమంది అమరులయ్యారని, నాడు గాంధీభవన్ వద్ద జరిగిన ఘటనను వేముల గుర్తుచేశారు. అమరుల కుటుంబాన్ని బీఆర్ఎస్ తరుపున ఆదుకున్నట్టు తెలిపారు. వివిధ కారణాలతో వర్గీకరణ అంశం సుప్రీంకోర్టుకు చేరితే, బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంప్లీడ్ అయి మంచి లాయర్లను ఏర్పాటు చేసి వర్గీకరణకు అనుకూలంగా వాదనలు వినిపించిందని వివరించారు. ఫలితంగానే 2024 ఆగస్టు 1న వర్గీకరణ హక్కులను ఆయా రాష్ట్రాలకు అప్పగిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని చెప్పారు. ఇప్పుడు వర్గీకరణ కోసం ఎలాంటి కార్యాచరణ తీసుకున్నా, బీఆర్ఎస్ నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టంచేశారు.

కాంగ్రెస్, బీజేపీ రెండూ అన్యాయమే చేశాయి

కాంగ్రెస్ పార్టీ పదేండ్లు, బీజేపీ పదేండ్లు మాదిగలకు అన్యాయం చేశాయని వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. ఆ రెండు ఆ పార్టీల వల్లే వర్గీకరణ ఆలస్యమైందని ఆగ్రహం వ్యక్తంచేశారు. 2004 నుంచి 2014 వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఉషామెహ్రా కమిషన్ సిఫారసులను అమలుచేయలేదని, 2014 నుంచి 2024 వరకు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి సంపూర్ణ మెజార్టీ ఉన్నప్పటికీ, రాజ్యాంగ సవరణ చేయలేదని దుయ్యబట్టారు. నాడు తెలంగాణ ప్రభుత్వం పంపించిన తీర్మానాన్ని కేంద్రం అమలు చేసి ఉంటే, ఈ పదేండ్లు ఆయా ఫలాలు మాదిగ బిడ్డలకు దక్కేవని చెప్పారు.

వర్గీకరణ తర్వాతే స్థానిక ఎన్నికలు పెట్టండి

ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తయితే, స్థానిక సంస్థల్లో వారికి అవకాశాలు పెరుగుతాయి కాబట్టి, ఎస్సీ వర్గీకరణ అమల్లోకి వచ్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. అదేవిధంగా 2024 ఆగస్టు 1 సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వగానే తదుపరి భర్తీ చేసే ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలు చేస్తామని నాడు సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనను గుర్తుచేశారు. కానీ, గత ఆరు నెలల్లో జారీచేసిన నోటిఫికేషన్లలో మాత్రం రిజర్వేషన్లు అమలు చేయకుండా వారికి అన్యాయం చేశారని విమర్శించారు. కనీసం ఇప్పటినుంచైనా భర్తీ చేసే ఉద్యోగాల్లో వర్గీకరణ త్వరగా పూర్తి చేసి, రిజర్వేషన్లు అమలుచేయాలని డిమాండ్ చేశారు.

మా గొంతు నొక్కేస్తారా?

- పెండింగ్ బిల్లులపై మంత్రులకు వినతిపత్రం ఇచ్చేందుకు వస్తే అక్రమంగా అరెస్టు చేస్తారా?
- తీవ్రవాదుల్లాగా ఎక్కడికక్కడ నిర్బంధిస్తారా?
- సర్పంచుల జేఏసీ అధ్యక్షుడు యాదయ్యగౌడ్

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులపై మంత్రులకు వినతిపత్రం ఇచ్చేందుకు వస్తే పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేసి గొంతు నొక్కేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ ధ్వజమెత్తారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున మంత్రులను, ఎమ్మెల్యేలను కలిసి పెండింగ్ బిల్లుల విడుదల గురించి విన్నవించి, అసెంబ్లీలో చర్చ జరిగేలా చూడాలని వినతిపత్రం ఇచ్చేందుకు మంగళవారం అసెంబ్లీ వద్దకు వచ్చిన తమను పోలీసులతో అక్రమంగా అరెస్టు చేయించారని విమర్శించారు. శాంతియుతంగా గాంధేయమార్గంలో అసెంబ్లీ వద్దకు వచ్చిన తమను తీవ్రవాదుల తరహాలో అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారని విమర్శించారు. మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు రూ.800 కోట్ల వరకు ఉన్నాయని తెలిపారు. గత ఏడాది మార్చి 31లోపు ఇస్తామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క హామీ ఇచ్చినా నేటికీ నిధులు విడుదల చేయలేదని వాపోయారు. రూ.1.58 లక్షల కోట్లకుపైగా అప్పు చేసిన రేవంత్‌రెడ్డి సర్కారు.. అందులో ఒక్క శాతం కూడా లేని తమ బిల్లులు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. యాదయ్య గౌడ్ వెంట జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, కార్యదర్శి కేశబోయిన మల్లయ్య, నాయకులు బొడ్డు నరసింహయాదవ్, మన్నె పద్మారెడ్డి, ప్రభాకర్, శ్రీమల్ల మేఘరాజు, రాజేందర్ తదితరులు ఉన్నారు.

మాదిగల పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): మాదిగలు, మాదిగ ఉపకులాల పోరాటాల ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమవుతుందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వం వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నామని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం 2014లోనే ఎస్సీ వర్గీకరణ చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి.. కేంద్రానికి పంపించారని గుర్తుచేశారు. ఏ లెక్కన మాదిగలకు 9% రిజర్వేషన్లు ఇచ్చారో చెప్పాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎస్సీల జనాభాను సమగ్రంగా సేకరించి అందుకను గుణంగా రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

షమీమ్ అక్తర్ కమిషన్ రిపోర్టు ఇవ్వడం లేదు

- ఎస్సీల వర్గీకరణ విధానంపై అపోహలు
- నివేదిక ఇస్తే చదివి నివృత్తి చేసుకుంటాం
- సీఎం చెప్పినా రిపోర్ట్ ఇవ్వడం లేదు
- రిజర్వేషన్లు పెంచాకే వర్గీకరణ అమలు చేయాలి..మాలలపై దుష్ప్రచారం చేశారు: అసెంబ్లీలో ఎమ్మెల్యే వివేక్

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): ఎస్సీల వర్గీకరణపై ఏర్పాటు చేసిన షమీమ్ అక్తర్ కమిషన్ నివేదికను తమకు ఇవ్వడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆరోపించారు. వర్గీకరణ విధానంపై కొన్ని అపోహలున్నాయని, నివేదికలో ఏం ఉన్నదో, వర్గీకరణ ఎలా చేస్తున్నారో తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నదని స్పష్టం చేశారు. కానీ, స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినా నివేదిక ఇవ్వడం లేదని, ఫోన్‌చేసినా అసెంబ్లీ కార్యదర్శి స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణపై మంగళవారం అసెంబ్లీలో వివేక్ మాట్లాడుతూ.. హర్యానా, తమిళనాడు, పంజాబ్ మాదిరిగా ఎస్సీ రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాలని, ఆ తర్వాతే వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాలలే అన్ని ఉద్యోగాలు, రిజర్వేషన్లు తీసుకున్నారనే దుష్ప్రచారాన్ని ఆయన ఖండిస్తూ.. 2016-24 మధ్య కాలంలో మాదిగలకు 66,522 ఉద్యోగాలు, మాలలకు 48,388 ఉద్యోగాలు వచ్చాయని వివరించారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లలో మాదిగలకు 66,453 వచ్చాయని, మాలలకు 41,413 వచ్చాయని